సాక్షి
నాగర్‌కర్నూల్

బుధవారం । 6 । డిసెంబర్ । 2023



సమాజసేవకు ప్రోత్సాహం

జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు అరుదైన ఘనత దక్కింది.

వివరాలు 8లో ▸



.. హుండీ లెక్కింపు

కురుమూర్తి ఆలయ హుండీని మంగళవారం రెండోసారి లెక్కించారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
31.8 /17.4

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి. ఓ మోస్తరు వర్షం కురవచ్చు. రాత్రి చలి తీవ్రత ఉంటుంది.

అంతర్మథనం!

- ఎన్నికల్లో ఓటమిపై బీఆర్‌ఎస్ పోస్టుమార్టం
- అంచనాలు తలకిందులు కావడంపై విశ్లేషణ
- బూత్‌ల వారీగా ఓట్ల లెక్కలు తీస్తున్న నాయకులు



అచ్చంపేట: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో బీఆర్‌ఎస్ నాయకులు అంతర్మథనంలో పడ్డారు. గెలుపు అంచనాలు తలకిందులు కావడానికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. ఎన్నికల్లో గెలుపుపై బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ధీమాతో ఉండగా.. విజయం కాంగ్రెస్‌ను వరించింది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో హస్తం హవా చాటింది. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్య పోటీ కొనసాగగా.. కల్వకుర్తిలో మాత్రం కాంగ్రెస్, బీజేపీల మధ్య హోరాహోరీ పోరు కొనసాగింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ఎన్నికల్లో ఎలాంటి ప్రభావం చూపలేకపోయాయి. ఓటర్లు సైలెంట్‌గా హస్తం గుర్తుపై ఓటేసినట్లు స్పష్టమవుతోంది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు అందకుండా నల్లమలలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే ఇందుకు నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

ఊహించని షాక్..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్కువ స్థానాలు సాధిస్తామని బీఆర్‌ఎస్ ఆశలు పెట్టుకుంది. చివరి వరకు తమదే విజయమనుకున్న బీఆర్‌ఎస్ అభ్యర్థులకు ఓట్ల లెక్కింపుతో ఊహించని షాక్ తగిలింది. తాజా మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, జైపాల్‌యాదవ్ వంటి ఉద్దండ నేతలు ఓటమి చవిచూశారు. ఉమ్మడి జిల్లాలో కేవలం రెండు స్థానాలకే ఆ పార్టీ పరిమితమైంది. ఓటర్లు ఇంతగా కాంగ్రెస్ వైపు ఎందుకు మొగ్గు చూపారన్న విశ్లేషణ పార్టీలో సాగుతోంది. అసలు ఏం జరిగిందని క్షేత్ర స్థాయిలో సమాచారం సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. పట్టణాలు, గ్రామాల్లో ముఖ్యనేతలు, కేడర్ అంతా కలిసి పని చేశారా? లేక బీఆర్‌ఎస్‌కు కోవర్టుగా మారారా? అన్న సమాచారం తీసుకుంటున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా లెక్కలు తీస్తున్నారు. బీఆర్‌ఎస్ బలంగా ఉన్న గ్రామాల్లో కాంగ్రెస్ గాలి వీయడానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు.

గట్టెక్కించని పథకాలు..

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రచారం, అభివృద్ధి, సంక్షేమ పథకాలు తమను గట్టెక్కిస్తాయని పార్టీ అభ్యర్థులు భావించారు. ప్రధానంగా నిరంతర విద్యుత్ సరఫరా, రైతుబంధు, ఆసరా పింఛన్ పెంపు, రైతుబంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు, బీసీబంధు వంటి పథకాలతో ప్రజలు ఓట్లు వేస్తారని ఆశపడ్డారు. అయితే బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాలు ఎన్నికల్లో ప్రభావం చూపలేకపోయాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కొంపముంచిన అవినీతి, వెన్నుపోటు రాజకీయాలు

సంక్షేమ పథకాల అమలు బీఆర్‌ఎస్ నాయకుల కనుసన్నల్లో జరగడం.. లబ్ధిదారుల ఎంపికలో ద్వితీయ శ్రేణి నాయకులు చేతివాటం ప్రదర్శించడంతో పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పవచ్చు. అందరిని సమన్వయం చేసి పథకాలను అర్హులకు అందించాల్సిన నాయకులు.. గ్రామాల్లో రెండు వర్గాలుగా తయారు కావడం, వెన్నుపోటు రాజకీయాలకు పాల్పడటం వంటి విషయాలు పార్టీని కోలుకోలేని దెబ్బతీశాయని తెలుస్తోంది. కాగా బీఆర్‌ఎస్ కార్యకర్తలుగా కొనసాగుతున్న చాలామంది పార్టీ అభ్యర్థులకు ఓటు వేయలేదని స్పష్టమవుతోంది. స్థానిక ఎమ్మెల్యేలు, ద్వితీయ శ్రేణి నాయకత్వంపై ఉన్న కోపం ఓట్ల రూపంలో వెల్లడైందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గడిచిన పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ నాయకులు వేలకొద్దీ సభ్యత్వాలు చేశారు. వారందరూ ఓట్లు వేసినా పార్టీకి కనీస ఓట్లు రావాల్సి ఉంది. చాలా పోలింగ్ కేంద్రాల్లో ప్రతిపక్షాలకే అధిక ఓట్లు రావడంతో వీరంతా సొంత పార్టీకి ఓట్లు వేశారా అనే సందేహం వ్యక్తమవుతోంది. ఏదేమైనప్పటికీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ శ్రేణులు జోష్‌లో ఉంటే.. బీఆర్‌ఎస్ మాత్రం ఓటమిపై పోస్టుమార్టం చేస్తోంది.

● పాలమూరుకు పట్టం

సీఎం మనోడే..

ముఖ్యమంత్రి పీఠంపై రేవంత్‌రెడ్డి

- బూర్గుల తర్వాత పాలమూరు వాసికి దక్కనున్న ఉన్నత పదవి
- జెడ్పీటీసీ నుంచి అంచెలంచెలుగా ఎదిగిన ఎనుముల
- ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీగా సేవలు..
- టీపీసీసీ చీఫ్‌గా కాంగ్రెస్ శ్రేణుల్లో తనదైన ముద్ర
- రాష్ట్రంలో మార్పు.. హస్తం గెలుపే లక్ష్యంగా కృషి



ఎలాంటి రాజకీయ వారసత్వం లేదు.. సామాన్య కుటుంబంలో జన్మించిన వ్యక్తి. సడలని పట్టుదల, అకుంఠిత దీక్షతో రాజకీయాల్లోకి అడుగుపెట్టి అంచెలంచెలుగా ఎదిగిన ఆయన ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించనున్నారు. ఉమ్మడి పాలమూరు కీర్తిపతాకాన్ని మరోమారు రెపరెపలాడించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రాభవాన్ని కోల్పోయి అచేతన స్థితిలో కొట్టుమిట్టాడుతున్న కాంగ్రెస్‌కు అలుపెరగని పోరాటంతో ఊపిరిలూదిన ఎనుముల రేవంత్‌రెడ్డి. రాష్ట్రంతోపాటు కేంద్రంలోని అధికార పార్టీలపై పదునైన విమర్శలు, ఉద్వేగపూరిత ప్రసంగాలతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. హస్తం గెలుపే లక్ష్యంగా రాష్ట్రంలో మార్పు రావాలి అనే నినాదంతో ప్రజల మనసులను గెలుచుకున్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన అనతికాలంలోనే పార్టీని అధికార బాట పట్టించారు. నల్లమల అటవీ పరిధిలోని నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో జన్మించిన ఆయనను సీఎంగా ఖరారు చేస్తూ కాంగ్రెస్ అధిష్టానం **నిర్ణయం** తీసుకోవడంతో ఉమ్మడి **జిల్లావ్యాప్తంగా** హర్షాతిరేకాలు వ్యక్తమవు**తున్నాయి.**

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

బూర్గుల తర్వాత మళ్లీ..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బూర్గుల రామకృష్ణారావు 1952లో షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై హైదరాబాద్ రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి అయ్యారు. సుమారు 71 ఏళ్ల తర్వాత ఇప్పుడు ఇదే జిల్లాకు చెందిన కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన రేవంత్‌రెడ్డి తెలంగాణకు రెండో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. దీంతో సీఎం మనోడే అంటూ ఆయన పుట్టిన ఊరు కొండారెడ్డిపల్లి , ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సంబరాలు అంబరాన్నంటాయి.

రైతు కుటుంబం నుంచి..

వంగూరు మండలం కొండారెడ్డిపల్లికి చెందిన నర్సింహారెడ్డి, రామచంద్రమ్మ దంపతులది సాధారణ రైతు కుటుంబం. వీరికి ఏడుగురు మగ, ఒక ఆడ సంతానం. 1967 నవంబర్ 8న రేవంత్‌రెడ్డి జన్మించారు. రేవంత్‌రెడ్డి ప్రాథమిక విద్యాభ్యాసం ఐదో తరగతి వరకు కొండారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో కొనసాగింది. ఆరో తరగతి కల్వకుర్తి మండలం (అప్పుడు వెల్దండ) తాండ్రలోని ఉన్నత పాఠశాలలో చదివారు. ఏడు నుంచి పదో తరగతి వరకు వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించారు. ఇంటర్మీడియట్ వనపర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల.. డిగ్రీ (బీఏ ఆర్ట్స్) హైదరాబాద్‌లోని ఏవీ కాలేజీలో చదివారు. జేఎన్‌టీయూలో ఫైన్ ఆర్ట్స్ కోర్సు పూర్తి చేశారు. రేవంత్‌రెడ్డికి భార్య గీతారెడ్డి, కూతురు నైమిషారెడ్డి ఉన్నారు.

ఈ అవకాశం మళ్లీ రాదంటూ..

రాష్ట్రంలోని 119 మంది కాంగ్రెస్ అభ్యర్థుల్లో ఎంతోమంది పెద్దవాళ్లు, ఉద్దండులు ఉన్నా పాలమూరు బిడ్డ సంతకంతోనే పోటీలో నిలుస్తున్నారు. ఇది పాలమూరు గడ్డ గొప్పతనం. హైదరాబాద్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు తర్వాత 70 ఏళ్లకు మళ్లీ మనకు అవకాశం వచ్చింది. ఇప్పుడు చేజారితే ఈ అవకాశం రాదు. పాలమూరు బిడ్డలు నాటిన మొక్కను నరికేందుకు ఢిల్లీ నుంచి కొందరు, గల్లీ నుంచి మరికొందరు గొడ్డళ్లు పట్టుకుని వస్తున్నారు. పాలమూరు బిడ్డలు చైతన్యంతో ఎదురుతిరగాలి.

– రేవంత్‌రెడ్డి

2021లో టీపీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా వ్యూహాత్మకంగా వ్యవహరించారు.

టీపీసీసీ చీఫ్ తర్వాత అనతికాలంలోనే..

సుమారు రెండేళ్లుగా పక్కా ప్రణాళికతో కాంగ్రెస్ అగ్రనేతల సహకారంతో, ఐకమత్యంతో పార్టీని ముందుకు నడిపిస్తూ.. నిర్విరామంగా ప్రజల్లో ఉంటూ పార్టీని విజయతీరాలకు చేర్చారు. అనతి కాలంలోనే తన సవాల్‌ను నెగ్గించుకోవడమే కాకుండా.. ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించేందుకు రెడీ అవుతున్నారు.



మిడ్జిల్ జెడ్పీటీసీగా ఉన్నప్పుడు సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న రేవంత్‌రెడ్డి (ఫైల్)

రేవంత్‌కు చిన్ననాటి నుంచే రాజకీయాలపై ఆసక్తి ఎక్కువ. ఈ క్రమంలో 2004లో బీఆర్‌ఎస్ అప్పటి టీఆర్‌ఎస్‌లో చేరి కొంతకాలం పనిచేశారు. 2006లో మిడ్జిల్ మండలం నుంచి జెడ్పీటీసీ అభ్యర్థిగా స్వతంత్రంగా బరిలో

జెడ్పీటీసీ టు ముఖ్యమంత్రి..

నిలిచి విజయం సాధించారు. ఆ తర్వాత స్థానిక సంస్థల కోటాలో మహబూబ్‌నగర్ శాసనమండలి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచారు. ఆ తర్వాత టీడీపీలో చేరారు. ఆ పార్టీ నుంచి 2009, 2014లో కొడంగల్ నుంచి వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

'ఓటుకు నోటు'తో మలుపు.. తొలి నుంచీ దూకుడే..

తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా.. 2015 మే 15న రేవంత్‌రెడ్డిని ఓటుకు నోటు కేసులో పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఆ సమయంలో కేసీఆర్‌ను గద్దె దించడమే తన లక్ష్యమని ప్రకటించారు. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో 2017లో టీడీపీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతూ 2018 ఎన్నికల్లో కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఆయన ఓటమి పాలయ్యారు. అనంతరం 2019 లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీగా పోటీచేసి గెలుపొందారు. 2021 జూలై 7న టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ ఏడాది తనతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అఖండ మెజార్టీ వచ్చేలా చేసి ముఖ్యమంత్రి కాబోతున్నారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా రేవంత్ తొలి నుంచీ దూకుడుగానే ముందుకు సాగారు.

ఆనాటి గెలుపు ఇలా..

2006లో కాంగ్రెస్ ప్రభుత్వంలో బీఆర్‌ఎస్ భాగస్వామి కాగా.. అలయెన్స్‌లో మిడ్జిల్ జెడ్పీటీసీ టికెట్ హస్తానికి వచ్చింది. బీఆర్‌ఎస్ నుంచి టికెట్ ఆశించి భంగపడిన రేవంత్‌రెడ్డి చక్రం తిప్పారు. టీడీపీ, బీజేపీ, వామపక్షాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి.. వారి మద్దతుతో కప్పు సాసర్ గుర్తుతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగారు. సుమారు 1300 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి గౌస్‌పై విజయం సాధించారు. ప్రస్తుతం రేవంత్ సీఎం పీఠాన్ని అధిరోహించనున్న నేపథ్యంలో ఎండీ రబ్బానీ 'సాక్షి'తో మాట్లాడారు.

పదునైన విమర్శలు.. ఉద్వేగపూరిత ప్రసంగాలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: పదునైన విమర్శలు, ఉద్వేగపూరిత ప్రసంగాలే కాదు.. దూకుడుగా నిర్ణయాలు తీసుకోవడం, వెంటనే అమలు చేయడం ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రత్యేకత. చిన్న నాటి నుంచి రాజకీయాలపై ఆసక్తి పెంచుకున్న ఆయన 2006లో మిడ్జిల్ జెడ్పీటీసీ సభ్యుడిగా బరిలో నిలిచి గెలిచిన తీరు ఇప్పటికీ చర్చనీయాంశమే. ఒక సారి ఎమ్మెల్సీ, ఒక దఫా ఎంపీ, ఇప్పటితో కలిపి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవంత్ రాజకీయ జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చవిచూశారు. అయినా పట్టుదలతో టీపీసీసీ చీఫ్‌గా అనతికాలంలోనే కాంగ్రెస్‌లో జవసత్వాలు నింపి.. పార్టీని ముందుండి నడిపించారు. తాను బరిలో నిలిచిన కొడంగల్‌లో నామినేషన్‌కు ఒక రోజు, రోడ్‌షోకు మరో రోజు, కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకాగాంధీ సభకు ఇంకో రోజు.. ఇలా కేవలం మూడు సార్లు మాత్రమే ప్రచారానికి వచ్చిన రేవంత్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల్లో 83 ప్రచార సభల్లో పాల్గొన్నారు. అధికార బీఆర్‌ఎస్, బీజేపీలపై తూటాల్లాంటి మాటలు, విమర్శలతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపడమే కాకుండా.. ఉద్వేగ ప్రసంగాలతో ప్రజల మనసు దోచుకుని కాంగ్రెస్‌ను విజయతీరాలకు చేర్చారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డి రేపు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించనున్న నేపథ్యంలో ఆయన రాజకీయ జీవితంలో చోటుచేసుకున్న తీపిగుర్తులు, ప్రసంగాల తీరును ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.



కొండారెడ్డిపల్లిలో దసరా ఉత్సవాల్లో పాల్గొన్న రేవంత్‌రెడ్డి (ఫైల్)

ఎస్.. ధీ అంటే ధీ..

నల్లగొండలో నిర్వహించిన సభలో ఆ జిల్లాకు చెందిన ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మేము మా జిల్లాలో 12కు 12 సీట్లు గెలుస్తాం.. రేవంత్‌రెడ్డి పాలమూరులో 14కు 14 సీట్లు గెలిపిస్తారా అని సవాల్ విసిరారు. అక్కడే ఉన్న రేవంత్‌రెడ్డి సైతం యస్.. గెలిచి తీరుతాం అన్నారు. వారు అన్నట్లే నల్లగొండ జిల్లాలో 11 సీట్లు కాంగ్రెస్‌కు రాగా.. మహబూబ్‌నగర్‌లో 12 కైవసం చేసుకున్నారు.

ఆనందం.. హర్షం..



కొండారెడ్డిపల్లిలో సంబరాలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

- రేవంత్ స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో గ్రామస్తుల సంబరాలు
- దేశ స్థాయిలో మా ఊరికి పేరొచ్చిందని సంతోషం
- చిన్నతనంలోనే రాజకీయాలపై మక్కువ చూపించారన్న స్నేహితులు
- కొడంగల్ దశ మారుతుందంటున్న నియోజకవర్గవాసులు

కోస్గి/కల్వకుర్తి/వంగూరు/మిడ్జిల్: నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లికి చెందిన రేవంత్‌రెడ్డి రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఆయన స్వగ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని సామాన్య కుటుంబంలో జన్మించిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడుతుండటంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఎంత ఉన్నతస్థాయికి ఎదిగినా రేవంత్.. తమ బాగోగులు చూసుకుంటారని గ్రామస్తులు చెప్పారు. రాజకీయ జీవితంలో ఎంత బిజీగా ఉన్నా ప్రతి దసరా పండుగను కొండారెడ్డిపల్లిలో జరుపుకొంటారని.. అందరితో ఆప్యాయంగా మాట్లాడుతారని తెలిపారు. చిన్నతనంలోనే రాజకీయాల గురించి ఎంతో మక్కువ చూపేవారని స్నేహితులు చెబుతుండగా.. ప్రతిపక్షంలో ఉండి కూడా కొడంగల్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, ఇప్పుడు సీఎంగా మా ప్రాంతం దశ మారిపోతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు తమ మనోగతాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.

నేను మీరు నాటిన మొక్కను.. మీరే కాపాడుకోవాలి

రాజకీయంగా నాకు అస్తిత్వాన్నిచ్చి, ఆత్మగౌరవాన్నిచ్చి, తల తెగి కింద పడ్డ ఎవరి ముందు తల దించకుండా నిటారుగా నిలబడి పోరాటం చేయాలని కొడంగల్ గడ్డ నాకు నేర్పిందని, కొడంగల్ ప్రజలు ఆశీర్విదించండి, మీరు అండగా ఉన్నంతవరకు ఇటు రాష్ట్రంలో కేసీఆర్, అటు దేశంలో మోదీ మెడలు వంచే బాధ్యత మీ బిడ్డగా నేను తీసుకుంటానని, మీరు ఆశీర్వదిస్తే కొడంగల్ రాష్ట్రం మొత్తాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తుందని. మీరు కొడంగల్‌లో నాటిన మొక్క నేడు మహావృక్షమైంది. ఈ వృక్షాన్ని నరకడానికి కొందరు గొడ్డళ్లతో వస్తున్నారు. మీరు నాటి పెంచిన వృక్షాన్ని మీరే కాపాడుకోవాలి.

రేవంత్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి..



రేవంత్ అన్నను ఆదర్శంగా తీసుకుని రాజకీయాల్లోకి వచ్చాను. యువత రాజకీయాల్లో ఎలా ఉండాలనేది ఆయనను చూసి ఎంతో నేర్చుకున్నాను. ఎన్‌ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్‌లో పనిచేస్తున్నాను.

– అనిల్‌యాదవ్, కొండారెడ్డిపల్లి

పలకరింపుతోనే కడుపు నిండుతుంది..



ఏ సందర్భంలోనైనా రేవంత్‌ను కలిసినప్పుడు ఆయన పలకరించే విధానంలోనే కడుపు నిండుతుంది. అవినీతి రహిత రాజకీయాలు చేయడంతో పాటు ఇచ్చిన మాట నిలుపుకొనే తత్వం రేవంత్‌రెడ్డిది. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని రాజకీయం చేయాలి.

– లక్ష్మారెడ్డి, కొండారెడ్డిపల్లి

ఒకే బెంచీలో కూర్చునే వాళ్లం..



1980–81లో తాండ్ర గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నేను రేవంత్‌రెడ్డి కలిసి 6వ తరగతి చదువుకున్నాం. అప్పట్లో అతను నాతో రాజకీయాల గురించి చాలా ఆసక్తిగా మాట్లాడేవాడు. అప్పటి రాజకీయాల గురించి చాలా నిశితంగా పరిశీలన చేసినట్లుగానే చెప్పేవాడు. ఇలా రాజకీయాలు మాట్లాడిన నా స్నేహితుడు రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతాడని ఊహించలేదు.

– రంగారెడ్డి, తాండ్ర, రేవంత్‌రెడ్డి క్లాస్‌మేట్

చాలా చురుకైన వ్యక్తి..



మా తరగతిలో రేవంత్ చాలా చురుకైన వ్యక్తి. నిత్యం మాతో చాలా చలాకీగా వ్యవహరించేవాడు. మాతో పాటు చదువుకున్న వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని పదవులు అధిరోహించి రాష్ట్రంతో పాటు మన ప్రాంతానికి వన్నె తెస్తారని ఆశిస్తున్నాను.

– శ్రీలక్ష్మి, తాండ్ర, రేవంత్‌రెడ్డి క్లాస్‌మేట్

కొడంగల్ ప్రజల అదృష్టం..



అధికారంలో లేకపోయినా ప్రజలకు ఇచ్చిన మాట మేరకు కొడంగల్‌లో బస్ డిపో కోసం సొంతంగా స్థలం కొనుగోలు చేసి ఇచ్చారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు చేసిన రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి సీఎం కావడం కొడంగల్ ప్రజల అదృష్టం. అభివృద్ధిలో కొడంగల్ రాష్ట్రంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలుస్తుంది.

– గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్, పోతిరెడ్డిపల్లి

ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ అభివృద్ధి..



మొదటిసారి టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ కొడంగల్‌లో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. అభివృద్ధి అంటేనే రేవంత్‌రెడ్డి అన్న చందంగా మారింది. కొడంగల్ అభివృద్ధి కోసం అప్పటి ప్రభుత్వంతో పోరాడి తనకంటూ ఓ ప్రత్యేకత సంపాదించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి కావడంతో కొడంగల్ అభివృద్ధిలో దూసుకుపోతుంది.

– బిజ్జ రాములు, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు, కోస్గి

యువతకు ఆదర్శం..



రాజకీయాల్లో రేవంత్‌రెడ్డి చూపిన పోరాట పటిమ నేటితరం యువతకు ఆదర్శం. గత ప్రభుత్వం ఎన్ని విధాలుగా వేధించినా ధైర్యంగా ముందుకుసాగారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కానున్న రేవంత్‌రెడ్డి కొడంగల్ ఎమ్మెల్యే కావడం ఇక్కడి ప్రజల అదృష్టం. ఎక్కడికి వెళ్లినా మా ముఖ్యమంత్రి అని సగర్వంగా చెబుతాం.

– రాఘవేందర్, కోస్గి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు

కల్వకుర్తి రూరల్: వ్యాపార వాణిజ్య సముదాయాలతో పాటు పరిశ్రమలలో బాలలను పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవని కార్మికశాఖ జిల్లా అధికారి ఫసియొద్దీన్, సహాయ అధికారి మహేందర్ హెచ్చరించారు. కల్వకుర్తి మండలం మార్చాల సమీపంలోని సూర్యలత కాటన్ మిల్లులో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలలతో పని చేయించడం మానవ హక్కులను ఉల్లంఘించడమేనని అన్నారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎక్కడైన బాలకార్మికులు కనిపిస్తే డయల్ 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు. చదువుతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని, పిల్లలను పనులకు కాకుండా బడికి పంపించాలని తల్లిదండ్రులను కోరారు. కాటన్‌మిల్ సీఈఓ. రమణారెడ్డి పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి ఎంపిక హర్షణీయం



అచ్చంపేట: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తొలి ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డిని ప్రకటించడం హర్షణీయమని డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మంగళవారం ప్రకటనలో తెలిపారు. నల్లమల బిడ్డకు సీఎం పదవి దక్కడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా సీఎంగా రేవంత్‌రెడ్డిని ప్రకటించిన ఏఐసీసీ నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాక గాంధీ, మల్లికార్జున ఖర్గేలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటెత్తిన చైతన్యం



ఎమ్మెల్యేగా గెలుపొందిన విజయుడిని సన్మానిస్తున్న నాయకులు

గతం కంటే పార్టీలకు పెరిగిన ఓట్లు

- అయినా కాంగ్రెస్‌కు కలిసిరాని వైనం
- బీఎస్పీ, బీజేపీ, స్వతంత్రుల ప్రభావం అంతంతే..
- 20 ఏళ్లలో 49,290 మంది ఓటర్ల పెంపు

అలంపూర్: ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు శాతం.. ఓటర్లు పెరుగుతుండగా అందుకు తగ్గట్టుగా ఓటు శాతం పైపైకి వస్తోంది. అయితే, కొన్నిసార్లు పార్టీలకు గతం కంటే ఎక్కువ ఓట్లు వచ్చినా ఓటమి తప్పడం లేదు. ఈ సారి అలంపూర్ నియోజకవర్గాన్ని పరిశీలిస్తే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు పెరిగినా విజయాన్ని అందుకోలేకపోయింది. బీఆర్ఎస్ సైతం ఓట్లు పెరగడంతో విజయం తన ఖాతాల్లో వేసుకుంది. అయితే గత అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే ఈ సారి నోటాకు ఓట్లు తగ్గాయి. కానీ ప్రభావం ఉంటుందని భావించిన బీజేపీ, బీఎస్పీలకు ఆశించిన స్థాయిలో ఓట్లు పడలేదు. స్వతంత్ర అభ్యర్థులు సైతం ఎక్కడ ప్రభావం చూపలేదని చెప్పవచ్చు.

బీఆర్ఎస్‌కు 1,04,060 ఓట్లు

బీఆర్ఎస్ అభ్యర్థి విజయుడికి 1,04,060 ఓట్లు వేశారు. 2018లో మొత్తం 2,17,157 మంది ఓటర్లు ఉండగా 1,79,683 ఓట్లు పోలయ్యాయి. అందులో అప్పటి బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ వీఎం అబ్రహంకు 1,02,105 ఓట్లు వచ్చాయి. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి టీఆర్ఎస్ అభ్యర్థి 38004 ఓట్లు వచ్చాయి. 2014 ఎన్నికలతో పోల్చితే 66,056 ఓట్లు బీఆర్‌కు పెరిగినట్లు స్పష్టమవుతోంది.



క్యూలైన్‌లో ఓటర్లు

కాంగ్రెస్‌కు భారీగానే..

కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో ఓట్లు భారీగానే పెరిగాయి. కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్ ఈ ఎన్నికల్లో 73,487 ఓట్లు సాధించారు. 2018 ఎన్నికల్లోనూ ఈయనకు 57,428, 2014లో 57,419, 2009లో అప్పటి అభ్యర్థికి 49,722 ఓట్లు వచ్చాయి. 2018తో పోల్చితే ఈ సారి కాంగ్రెస్‌కు 16,059 ఓట్లు, 2014తో పోల్చితే 16,068 ఓట్లు, 2009తో పోల్చితే 23765 ఓట్లు పెరిగాయి. అయితే తక్కువ ఓట్లు వచ్చిన సందర్భాల్లో 2009లో డాక్టర్ వీఎం అబ్రహం, 2014లో ఎస్ఏ సంపత్ కుమార్‌కు విజయం దక్కింది. ఓట్లు పెరిగినప్పటికి 2018, 2023లో కాంగ్రెస్‌కు విజయం వరించలేదు. ఇదిలాఉండగా, ఎన్నికల్లో అభ్యర్థులు నచ్చకపోతే నోటాకు ఓటు వేసే అవకాశం ఉంది. ఈ సారి నోటాకు ఓట్లు తగ్గాయని చెప్పవచ్చు. 2018 నోటాకు 3,492 ఓట్లు రాగా.. ఈ సారి నోటాకు 2013 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇక బీజేపీ, బీఎస్పీ అభ్యర్థుల ప్రభావం ఎక్కడా కనిపించలేదు. బీఎస్పీ అభ్యర్థి మొత్తం 6082, బీజేపీ అభ్యర్థికి మొత్తం 4711 ఓట్లు వచ్చాయి. ఇక స్వతంత్రులు సైతం ప్రభావం చూపలేకపోయారు. బీసీఐ పార్టీ అభ్యర్థికి 795 ఓట్లు, ఆల్ ఇండియా సమత పార్టీ అభ్యర్థికి 260, డీఎస్పీ అభ్యర్థికి 455, ఏఐఎఫ్‌బీ అభ్యర్థికి 248, పీపీఐ పార్టీ అభ్యర్థికి 1152, స్వతంత్ర అభ్యర్థి గోపాల్‌కు 325, స్వతంత్ర అభ్యర్థి బీసన్నకు 1263, స్వతంత్ర అభ్యర్థి రాజుకు 1085, స్వతంత్ర అభ్యర్థి హెచ్. విజయ్ బాబుకు 863 ఓట్లు వచ్చాయి.

తాజాగా 82.50 శాతం ఓటింగ్

అలంపూర్ నియోజకవర్గానికి సంబంధించి 2,37,938 మంది ఓటర్లకు గాను 1,96,307 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో పోలింగ్ శాతం 82.50కు చేరింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 2,17,157 మంది ఓటర్లు ఉండగా 1,79,683 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 2,10,047 మంది ఓటర్లు ఉండగా 1,58,069 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2009 అసెంబ్లీ ఎన్నికల 1,88,678 మంది ఓటర్లకు 1,29,282 మంది ఓటేశారు. గత 20 ఏళ్లలో ఓట్లు ఏకంగా 49260 మంది ఓటర్లు పెరిగారు. అందుకే ఓటు శాతం పెరుగుతు వస్తోంది.

సమాజ సేవకు ప్రోత్సాహం

- మహారాష్ట్ర జాతీయ సమైక్య శిబిరానికి రాష్ట్రం నుంచి 10 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు
- పదిమందిలో 9 మంది జడ్చర్ల బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు
- వనపర్తి డిగ్రీ కళాశాల నుంచి మరొకరు
- నేటితో ముగియనున్న శిబిరం



శిబిరంలో స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న వలంటీర్లు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని డా.బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు 9 మందికి అరుదైన ఘనత దక్కింది. మహారాష్ట్ర, జల్‌గావ్‌లోని కవయిత్రి బహీన్‌భాయ్ చౌదరి నార్త్ మహారాష్ట్ర యూనివర్సిటీలో గత నెల 30 నుంచి నేటి(బుధవారం 6వ తేదీ) వరకు నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొనటమే విద్యార్థుల ఘనతగా చెప్పుకోవచ్చు. వివిధ రాష్ట్రాల నుంచి శిబిరంలో 200 మంది వలంటీర్లు పాల్గొనగా తెలంగాణ రాష్ట్రం నుంచి 10 మంది వలంటీర్లు పాల్గొన్నారు. అయితే రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు ఉన్న కారణంగా.. ఆయా యూనివర్సిటీలు శిబిరానికి వెళ్లేందుకు ఆసక్తి కనబర్చలేదు. దీంతో ఆ అవకాశం పాలమూరు యూనివర్సిటికి దక్కింది. యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లో మొత్తం 110 ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఉండగా.. 11 వేల మంది వలంటీర్లు ఉన్నారు. వారిలో సామర్థ్యాలు, ప్రతిభను పరిశీలించి పది మందిని ఎంపిక చేశారు. పది మందిలో 9 మంది బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు కాగా.. వనపర్తి డిగ్రీ కళాశాలకు చెందిన మరో విద్యార్థికి అవకాశం కల్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడు ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఉండగా.. యూనిట్ 1 నుంచి నలుగురు, యూనిట్ 2 నుంచి ఇద్దరు, యూనిట్ 3 నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. ఎంపికైన వలంటీర్లు నవంబర్ 29న మహారాష్ట్రకు బయలుదేరి వెళ్లారు. 30 నుంచి కొనసాగుతున్న జాతీయ సమైక్యత శిబిరంలో వారు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఉదయం వ్యాయామంతో ప్రారంభమయ్యే కార్యక్రమాలు స్వచ్ఛభారత్, స్థానికులతో ముఖాముఖి, విద్యావేత్తలు, ప్రముఖులతో పరిచయాలు, ప్రసంగాలు, తరువాత సాంస్కృతిక కార్యక్రమాలతో రోజువారి కార్యక్రమాలు ముగుస్తున్నాయి. శిబిరంలో కళాశాలకు చెందిన బొటానికల్ గార్డెన్, తెలంగాణ స్టేట్ హెర్బేరియం, బయో డైవర్సిటీల గూర్చి వివరించినట్లు వలంటీర్లు తెలియజేశారు. పీయూ ఆధ్వర్యంలో బొటానికల్ గార్డెన్‌లో ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహించగా.. తెలంగాణ రాష్ట్రం 33 జిల్లాలతో కూడిన పెద్ద మ్యాప్ రూపకల్పన చేసినట్లుగా వలంటీర్లు శిబిరంలో వివరించారు.

బీఆర్ఆర్ కళాశాల వలంటీర్లు

శిబిరంలో బీఆర్ఆర్ కళాశాలకు చెందిన రాఘవేంద్ర, రాజు, వీరాంజనేయులు, శ్రీను, శ్రీలక్ష్మి, శివరంజని, శృతి, మౌనిక, పాయల్ రాజ్‌పురోహిత్ లతో పాటు వనపర్తి కళాశాలకు చెందిన గణేష్ ఉన్నారు.



మహారాష్ట్ర నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌కు వెళ్లిన జడ్చర్ల బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు

నేటితో ముగియనున్న శిబిరం

నవంబర్ 30న ప్రారంభమైన జాతీయ సమైక్యత శిబిరం బుధవారంతో ముగియనుంది. ఆరు రోజులుగా ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన వలంటీర్లతో పరిచయాలు, వారితో కలసి పారిశుద్ధ్య కార్యక్రమాల్లో పాల్గొనటం, సాయంత్రం వేళలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ.. ఉత్సాహంగా ఉన్నారు. శిబిరంలో పాల్గొన్న వలంటీర్ల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

ఎన్ఎస్ఎస్ లక్ష్యాలు

1962లో కేంద్ర యువజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఎన్ఎస్ఎస్ లక్ష్యాలు ఇలా ఉన్నాయి. కళాశాలలు, యూనివర్సిటీల్లో ఎన్ఎస్ఎస్ యూనిట్లు నెలకొల్పి విద్యార్థుల్లో జాతీయ సమైక్యతాస్ఫూర్తి నింపటం, సామాజిక సంక్షేమ ఆలోచన రేకెత్తించటం, పక్షపాతం లేకుండా సమాజ సేవ అందించటం, జీవన ప్రమాణాలు మెరుగుపర్చటం, వనరుల కొరత ఉన్నప్పటికీ మంచి జీవనం గడపటం, జాతీయ విపత్తుల సమయంలో సాయం అందించటం వంటి ఆలోచనలు కలిగించటం లక్ష్యంగా పనిచేస్తుంది.

మొదటిసారి రాష్ట్రం దాటి ప్రయాణం



నా జీవితంలో తొలిసారిగా రాష్ట్రం దాటి మహారాష్ట్ర, జల్గావ్‌కు చేసిన రైలు ప్రయాణం ఎంతో అనుభూతిని అందించింది. శిబిరంలో దేశంలోని నలుమూలల నుంచి వచ్చిన వలంటీర్లను కలుసుకోవటంతో అనేక కొత్త విషయాలు, భాషలు, సంస్కృతి తెలియవచ్చింది. జాతీయ శిబిరంలో పాల్గొన్న తొలిసారే అనేక విషయాలపై స్పష్టత వచ్చింది. శిబిరానికి ఎంపిక చేసిన ఎన్ఎస్ఎస్ పీయూ కో ఆర్డినేటర్ ప్రవీణకు కృతజ్ఞతలు.

– శృతి, వలంటీర్

మా సంస్కృతితో మమేకం అయ్యేలా శిబిరం



ఉత్తరాదికి చెందిన మేము తెలంగాణలో స్థిరపడ్డాం. ఎన్ఎస్ఎస్ శిబిరం మహారాష్ట్రలో నిర్వహించటంతో మా సంస్కృతిలో మళ్లీ మమేకం చేసినట్లయ్యింది. ఉదయం వ్యాయామం, తరువాత స్వచ్ఛభారత్, విద్యావేత్తలు, గొప్పలవాళ్లతో పరిచయాలు, ప్రసంగాలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఇలా శిబిరం ఉల్లాసంగా కొనసాగింది.

– పాయల్ రాజ్‌పుత్ పురోహిత్, వలంటీర్

అరుదైన అవకాశం



జాతీయ సమైక్యత శిబిరానికి వెళ్లటం అరుదైన అవకాశం. మహారాష్ట్ర సంస్కృతితో పాటు గోవా, కర్ణాటక, ఒడిశా వంటి రాష్ట్రాల సంస్కృతులను పరిచయం చేసుకునే వెసలుబాటు దక్కింది. శిబిరానికి ఎంపిక చేసిన ప్రిన్సిపాల్ డా.అప్పియాచిన్నమ్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సుభాషిణిలకు కృతజ్ఞతలు. కళాశాలలోనే ఉంటే శిబిరం ద్వారా అనేక విషయాలు తెలుసుకోగలిగాను.

– రాఘవేంద్ర, శిబిరం టీమ్‌లీడర్

వ్యక్తిత్వంలో మార్పు..



స్వతాహగా నేను ఎవరితో ఎక్కువ మాట్లాడేవాడిని కాదు. ఎన్ఎస్ఎస్‌లో చేరటంతో నా స్టైల్ పూర్తిగా మారిపోయింది. అందులోనూ జాతీయ శిబిరానికి మహారాష్ట్ర రావటంతో నా వ్యక్తిత్వంలోనూ పూర్తి మార్పు వచ్చింది. పలు సంస్కృతులు, భాషలు, మనుషులు నన్ను ఎంతో ఆకట్టుకున్నాయి. ప్రతి రోజూ జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో నన్ను నేను మెరుగుపర్చుకునే అవకాశం దక్కింది.

– రాజు, వలంటీర్

కళాశాలకు దక్కిన అవకాశం సద్వినియోగం..



మహారాష్ట్ర జల్గావ్‌లో నిర్వహిస్తున్న జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొనేందుకు వలంటీర్లను ఎంపిక చేసే అవకాశం రావటాన్ని సద్వినియోగం చేసుకున్నాం. సాధారణ ఎన్నికలు ఉన్నప్పటికీ శిబిరం ప్రాముఖ్యత తెలిసిన ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మ వలంటీర్ల ఎంపికకు ఆమోదించింది. శిబిరానికి వెళ్లేందుకు వలంటీర్లు ఎక్కువ మంది ముందుకు వచ్చినప్పటికీ వారిలో 9 మందిని ఎంపిక చేశాం.

– సుభాషిణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, బీఆర్ఆర్ కళాశాల, జడ్చర్ల

కారు కిందపడి చిన్నారి దుర్మరణం

కృష్ణా: మండలంలోని హిందూపూర్ గ్రామపంచాయతీలో ఉన్న ఇటుక బట్టీలో యజమాని కారు కిందపడి మహారాష్ట్రకు చెందిన చిన్నారి పల్లవి (18 నెలలు) మృతిచెందినట్లు ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మహారాష్ట్రాలోని సోలాపూర్ ప్రాంతానికి చెందిన సుఖ్‌దేవ్ భార్యాపిల్లలతో కలిసి ఇటుక బట్టీలో పని చేస్తున్నారు. సోమవారం సుఖ్‌దేవ్ కుమార్తె ఆడుకుంటుండగా డ్రైవర్ కారును వెనకకు తీస్తుండగా టైర్ కిందపడి అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ప్రమాదంపై కేసు నమోదు కాకుండా బట్టి యజమాని చిన్నారి తల్లిదండ్రులను ఒప్పించే ప్రయత్నం చేశారు. చివరకు రాత్రి 11 గంటల సమయంలో ఫిర్యాదు చేయడంతో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. మృతదేహానికి రాయచూర్ రిమ్స్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఇటుక బట్టీలను మంగళవారం తహసీల్దార్ దయాకర్‌రెడ్డి పరిశీలించి పనులు నిలిపివేయించారు. ఇటుక తయారీకి రెవెన్యూశాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేవని, వాటిలో ఎవరూ పనులు చేయకూడదని ఆదేశించారు. ఇక నుంచి రెవెన్యూశాఖకు చెందిన ఓ అధికారి తరచూ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

పత్తి డీసీఎం బోల్తా: తప్పిన ప్రమాదం

మరికల్: పత్తిలోడ్‌తో వెళ్తున్న డీసీఎం మంగళవారం పస్పుల స్టేజీ సమీపంలోకి రాగానే అదుపు తప్పి బోల్తా పడింది. మండలంలోని వివిధ గ్రామాల్లో ఓ వ్యాపారీ సేకరించిన పత్తిన్ని డీసీఎంలో రాయచూర్‌కు తరలిస్తుండగా.. పస్పుల స్టేజీ వద్దకు రాగానే, ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడిందని డ్రైవర్ హన్మంతు తెలిపారు. ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదని తెలియజేశారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

కొల్లాపూర్ రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత శీతకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని దండోరా రాష్ట్ర కార్యదర్శి యాదగిరి మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం అంకిరావుపల్లిలో దండోరా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేసి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వర్గీకరణతోనే మాదిగ, ఉపకులాలకు న్యాయం చేకూరుతుందన్నారు.

భార్యపై అనుమానంతో పూడ్చిన శవం వెలికితీత



పెంచికలపాడులో పూడ్చిన శవాన్ని వెలికి తీయిస్తున్న పోలీసులు

గట్టు: మండల పరిధిలోని పెంచికలపాడులో పూడ్చిన శవాన్ని మంగళవారం వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ నందికర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెంచికలపాడుకు చెందిన బోయ శివకు 9 ఏళ్ల కిందట రాధతో వివాహం చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత నెల 28న శివ(27) ఇంట్లో విద్యుదాఘాతానికి గురై మృతిచెందినట్లుగా మృతుని భార్య తెలియజేయడంతో కుటుంబ సభ్యుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. అయితే మృతుడి భార్య వ్యవహారం అనుమానాస్పదంగా ఉండటంతో మృతిచెందిన శివ మెడ చుట్టూ గాయాలు ఉన్న విషయాన్ని గుర్తు కుచేసుకున్నారు. మృతుని పెదనాన్న బోయ కుర్మన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. గద్వాల నుంచి వచ్చిన వైద్య బృందం పూడ్చిన శవాన్ని వెలికి తీయించి సంఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం, మృతదేహాన్ని పూడ్చిపెట్టినట్లు ఎస్ఐ తెలియజేశారు.

హెల్మెట్ ధరించి గమ్యస్థానానికి..



బస్సు డ్రైవర్ హెల్మెట్ ధరించడం ఏంటని అనుకుంటున్నారా? అవును మీరు చూస్తున్నది నిజమే.. హైదరాబాద్ నుంచి నారాయణపేటకు ఆర్టీసీ బస్సు బయల్దేరగా.. కొడంగల్ సమీపంలో డ్రైవర్ ముందున్న అద్దం ఒక్కసారిగా పగిలిపోయింది. డ్రైవర్ తిరుపతయ్యతో పాటు కండెక్టర్ రఘువీర్‌కు గాజుముక్కలు తగిలి చేతి వేళ్లకు గాయాలయ్యాయి. మరోవైపు ముసురు.. చల్లని గాలితో బస్సును నడపడం డ్రైవర్‌కు కష్టసాధ్యంగా మారింది. ఈ క్రమంలో కొడంగల్ నుంచి బస్సు డ్రైవర్ హెల్మెట్ సహాయంతో బస్సు నడిపి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చారు.

– దామరగిద్ద

చలికాలం.. జీవాలు భద్రం



గొర్రెల మంద

- తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే తీరని నష్టం
- రకరకాల వ్యాధులు సోకే అవకాశం

అధికారి సలహా



రాఘవేందర్‌గౌడ్, పశు వైద్యాధికారి, మద్దూరు

మద్దూరు: ఈ ఏడాది దసరా ముందు నుంచే చలి ప్రారంభమైంది. రోజు రోజుకు చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో గొర్రెలు, మేకల్లో దొమ్మ, జలుబు వ్యాధుల ముప్పు పొంచి ఉంది. పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని మద్దూరు పశువైద్యాధికారి రాఘవేందర్‌గౌడ్ తెలిపారు. చలికాలంలో గొర్రెలు, మేలకలకు నిమ్ము జలుబు దగ్గు వ్యాధులు వస్తే వెంటనే వైద్యం అందించాలని సూచించారు. ఏయే నియమాలు పాటించాలో ఆయన మాటల్లోనే..

దొమ్మ రోగం..

దొమ్మ రోగం వ్యాప్తికి పలు రకాల బ్యాక్టీరియాలు, వైరస్‌లు పరాన్నజీవులు కారణం. కంటేజీయస్ కాప్రెస్ ఫ్లూలో నిమోనియా అనేది మేకలకు మాత్రమే వైరస్ కారణంగా తరుచూ వచ్చే వ్యాధి. ఈ వ్యాధి సోకిన జీవాలకు జ్వరం తీవ్రంగా ఉంటుంది. వేగంగా శ్వాస పీల్చుకోవడం, ఎగశ్వాస, ముక్కు నుంచి నీరు చిక్కడి చీమిడి కారడం, ఆకలి లేకపోవడం, రోజురోజుకు నీరసించిపోవడం జరుగుతుంది. కళ్లు ఎర్రబడి నీరు కారడం, వీపుభాగం వంగి ఉండటం, తల మెడ ముందుకు సాగినట్లు కనిపించడంతో పాటు ముక్కు రంధ్రాలు వెడల్పుగా అవుతాయి. త్వరగా చికిత్స చేయించకుంటే ఊపిరితిత్తులు వాచి వాటికి కూడా చీము పట్టే ప్రమాదముంది. అయితే ఈ లక్షణాలు అమ్మతల్లి, పీపీఆర్ మొదలైన జబ్బుల్లో కూడా కనిపిస్తాయి. ఈ మేరకు పెంపకందారులు జీవాలను వైద్యుల వద్దకు తీసుకెళ్లి దొమ్మరోగమా, కాదా అని నిర్ధారించుకున్న తర్వాతే చికిత్స చేయించాలి. ఇక వాతావరణంలో అకస్మాతుగా వచ్చే మార్పుల నుంచి జీవాలను రక్షించాలి. అధిక వర్షం, చలి నుంచి చిన్న పిల్లలను సంరక్షించాలి. నట్టల ముందు వేయాలి. అంటువ్యాధుల నివారణకు టీకాలు వేయించాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారం శుభ్రమైన నీటిని ఇవ్వాలి.

జలుబు, దగ్గు

ఈ వ్యాధి సోకినప్పుడు పశువులకు తుమ్ములు, కళ్లు, ముక్కు నుంచి నీరు కారడం, చీమిడి పసుపు రంగులోకి మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. పశువుల పాక ఇరుకుగా ఉండటం, గాలి వెలుతురు సరిగా లేకపోవడం, పాకల్లో తేమ, తడి ఎక్కువగా ఉండటం కాలుష్యం, దుమ్మ వాతావరణంలో అకస్మాతుగా వచ్చే మార్పులు ఈ జబ్బుకు కారణమతుంటాయి. అలాగే క్రిముల ద్వారా సోకే అంటువ్యాధులు ఉండటం, బయట నుంచి శ్వాస కోశంలోకి వచ్చే కణాలు, నూనె పదార్థం శ్వాసకోశాన్ని చికాకు పెట్టే ఇతర పదార్థాలు కూడా జలుబు, దగ్గుకు కారణమవుతాయి. దీని నివారణకు పాకలోకి గాలి, వెలుతురు సరిగా ప్రసరించేలా చూడాలి. వర్షం, వాతావరణం బాగా లేనప్పుడు జీవాలను బయటకు వదలకూడదు. పాకను శుభ్రంగా ఉంచాలి. అలాగే జబ్బు సోకినప్పుడు పశువైద్యాధికారులను సంప్రదించాలి. ఒక వేళ జీవి చనిపోతే పోస్టుమార్టం ద్వారా వ్యాధి నిర్ధారణ చేసి మందలోకి మిగిలిన జీవాలకు చికిత్స చేయించాలి. ఈ వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తగా దొమ్మ టీకా వేయించాలి.

విద్యార్థులకు 'మార్షల్ ఆర్ట్స్'



మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మార్షల్ ఆర్ట్స్ శిక్షణ తీసుకుంటున్న బాలికలు

ఉమ్మడి జిల్లాలో 651 పాఠశాలల్లో మూడు నెలలపాటు ప్రత్యేక శిక్షణ

మహబూబ్‌నగర్ క్రీడలు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాలికలకు 'రాణి లక్ష్మిబాయ్ ఆత్మరక్ష పరిశిక్షణ్' (సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం) కింద ఈ ఏడాది అక్టోబర్ నుంచి మార్షల్ ఆర్ట్స్ కరాటే శిక్షణ అందజేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,066 ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణకు ఎంపిక చేయగా.. ఉమ్మడి జిల్లాలో ఎలిమెంటరీ పాఠశాలలు 137, సెకండరీ, సీనియర్ సెకండరీ 514 పాఠశాలలు శిక్షణకు ఎంపిక చేశారు.

కరాటే శిక్షణ...

కొన్నేళ్ల నుంచి ప్రభుత్వం బాలికలకు ప్రత్యేక కరాటే శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. 'రాణి లక్ష్మిబాయ్ ఆత్మరక్ష పరిశిక్షణ్' పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లోని బాలికలకు మూడు నెలల శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే పాఠశాలల్లో కరాటే మాస్టర్లు బాలికలకు ప్రత్యేక శిక్షణ అందజేస్తున్నారు. బాలికలకు మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేకమైన తర్ఫీదునిచ్చారు. వారిలో ఆత్మవిశ్వాసం నింపేలా శిక్షణ అందజేస్తున్నారు. మార్షల్ ఆర్ట్స్ నేర్పిస్తున్న శిక్షకులకు నెలకు రూ.5 వేల చొప్పున, మూడు నెలలకు రూ.15 వేలు అందజేయనున్నారు. మూడు నెలల శిక్షణ అనంతరం ఈ నిధులను శిక్షకులకు చెక్ రూపంలో అందజేస్తారు.

ఉత్సాహ వాతావరణంలో శిక్షణ...

ఉమ్మడి జిల్లాలో ఉత్సాహ వాతావరణంలో బాలికలకు మార్షల్ ఆర్ట్స్ శిక్షణ కొనసాగుతోంది. సంఖ్య తక్కువగా ఉంటే ఒకేసారి, ఎక్కువగా ఉన్న చోట తరగతుల వారీగా కరాటే మాస్టర్లు శిక్షణ అందజేస్తున్నారు. ఒక్కో పాఠశాలలో వారంలో రెండు లేదా మూడు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో బాలికలకు రెండు నెలల నుంచి మార్షల్ ఆర్ట్స్‌లో మెరుగైన శిక్షణ అందుతుంది.

జిల్లా	ఎలిమెంటరీ	సెకండరీ పాఠశాలలు
మహబూబ్‌నగర్	30	137
నాగర్‌కర్నూల్	15	117
వనపర్తి	7	82
గద్వాల జోగులాంబ	39	94
నారాయణపేట	46	84



జిల్లా కేంద్రంలోని మహాత్మా గాంధీ రోడ్డు స్కూల్‌లో కరాటే శిక్షణ పొందుతున్న బాలికలు

బాలికల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది



ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ఇవ్వాలని గతంలో పలుమార్లు సీఎంల దృష్టికి తీసుకెళ్లాను. ప్రస్తుత సమాజంలో బాలికలకు మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ఎంతో అవసరం. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ఇస్తుండటం సంతోషంగా ఉంది. మూడు నెలలపాటు కాకుండా ప్రతి ప్రభుత్వ పాఠశాలకు ఒక కరాటే మాస్టర్‌ను నియామకం చేస్తే బాలికలకు మెరుగైన మార్షల్ ఆర్ట్స్ శిక్షణ లభిస్తుంది.

– ఎతినె చెన్నయ్య, స్టేట్ స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

మెరుగైన కరాటే శిక్షణ అందజేస్తున్నాం...



బాలికలకు మెరుగైన కరాటే శిక్షణ అందజేస్తున్నాం. మా కరాటే క్లబ్ ఆధ్వర్యంలో ఈ ఏడాది జిల్లా కేంద్రంలోని ఐదు ప్రభుత్వ పాఠశాలల్లో కరాటే ఇస్తున్నాం. ఈ మూడు నెలల్లో బాలికలకు కరాటేలో మెళకువలు నేర్పిస్తాం. కరాటేతో పాటు కర్రసాముపై ప్రత్యేక శిక్షణ అందజేస్తున్నాం.

– జహంగీర్‌పాష ఖాద్రీ, కరాటే మాస్టర్

నాలుగోసారి శిక్షణ ఇస్తున్న..



నాలుగోసారి ప్రభుత్వ బాలికలకు కరాటే శిక్షణ అందజేస్తున్నా. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో రెండు నెలల నుంచి ప్రత్యేక కరాటే శిక్షణతో పాటు యోగా శిక్షణ అందజేస్తున్నాం.

– కె.వెంకటేశ్, కరాటే మాస్టర్

ప్రమాద నిర్లక్ష్యాన్ని ప్రయాణికుడికి ఎలా ఆపాదిస్తారు?

బాధిత కుటుంబానికి రూ.29 లక్షలను వడ్డీతో చెల్లించాలన్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ సీటు పక్కనే కూర్చున్న వ్యక్తి మరణిస్తే, అతనికి నిర్లక్ష్యాన్ని ఎలా ఆపాదిస్తారని హైకోర్టు ప్రశ్నించింది. దీన్ని కారణంగా పేర్కొంటూ మృతుడి కుటుంబసభ్యులకు చెల్లించాల్సిన పరిహారాన్ని తగ్గించడం చెల్లదని, ట్రిబ్యునల్ ఉత్తర్వులు సరికాదని స్పష్టం చేసింది. పరిహారం మొత్తం రూ.29 లక్షలను వడ్డీతో సహా చెల్లించాలని న్యూఇండియా అస్యూరెన్స్ సంస్థను ఆదేశించింది. రోడ్డు ప్రమాదంలో తన భర్త మృతి చెందారని, ప్రమాద బీమా పరిహారాన్ని తగ్గిస్తూ ట్రిబ్యునల్ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మెదక్‌కు చెందిన ఎ.సత్యవతి మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిని జస్టిస్ పి.శ్యాంకోషి, జస్టిస్ ఎన్.తుకారాంజీ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్లకు రూ.29 లక్షల్లో కొంత మొత్తం పరిహారం ఇప్పటికే చెల్లించి ఉంటే దానిని మినహాయించి మిగిలిన మొత్తానికి గత పదేళ్లుగా వడ్డీ జమ చేసి చెల్లించాలని బీమా కంపెనీని ఆదేశించింది. పిటిషనర్ భర్త సుబ్బారావు కారులో 2013లో మచిలీపట్నం నుంచి హైదరాబాద్ వస్తుండగా రోడ్డు పక్కన వాహనాన్ని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందని, ఆ ప్రమాదంలో ఆయన మరణించారని పిటిషనర్ న్యాయవాది ధర్మాసనానికి నివేదించారు. ప్రమాదానికి కారులో ఉన్న వారు కూడా కారణమని చెప్పి పరిహారం రూ.29 లక్షల్లో సగమే చెల్లించాలని ట్రిబ్యునల్ ఉత్తర్వులిచ్చిందన్నారు. పిటిషనర్ భర్త డ్రైవర్ పక్కన కూర్చున్నారని, ప్రమాదానికి అతడెలా కారణమవుతారని ప్రశ్నించారు. బీమా సంస్థ తరపు న్యాయవాది ప్రతివాదన చేస్తూ, కారు డ్రైవర్, సుబ్బారావు నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ట్రిబ్యునల్ తేల్చిందన్నారు. వాదనల తర్వాత ట్రిబ్యునల్ ఇచ్చిన నిర్ణయాన్ని హైకోర్టు తప్పుబట్టింది. ఇరుపక్షాల నిర్లక్ష్యం ఉందని చెప్పి పరిహారాన్ని సగానికి తగ్గింపు చెల్లదని తేల్చి చెప్పింది.

వాళ్లు ఓడిపోవడం ఏమిటో?

- ముగ్గురు ఎంపీలు, ఇద్దరు ఎమ్మెల్యేల ఓటమిపై కమలదళంలో విస్మయం!
- బండి, ఈటల, అర్వింద్, రఘునందన్‌రావు, సోయం పరాజయం పెద్ద దెబ్బే
- పని చేయని బీసీ సీఎం నినాదం
- బండి టార్గెట్‌గా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కు
- బీజేపీ కీలక నేతల ఓటమిపై పార్టీ వర్గాల విశ్లేషణ



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో పక్కాగా గెలిచి సత్తా చాటుతారని భావించిన ముఖ్యనేతలే ఓటమి చవిచూడడంపై బీజేపీలో విస్మయం వ్యక్తమవుతోంది. పోటీచేసిన ముగ్గురు ఎంపీలు, ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు పరాజయం పాలు కావడాన్ని ఆ పార్టీ నాయకులు జీర్ణించు కోలేకపోతున్నారు. కరీంనగర్ ఎంపీగా, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ప్రజల్లో అత్యంత ప్రజాకర్షణ కలిగిన నాయకుల్లో ముఖ్యుడైన బండి సంజయ్, ఒకప్పుడు బీఆర్‌ఎస్‌లో నంబర్–టుగా వెలిగి, ఇప్పటిదాకా ఓటమి ఎరగని ఈటల రాజేందర్, నిజామాబాద్ ఎంపీగా కల్వకుంట్ల కవితపై గెలిచి సంచలనం సృష్టించిన ధర్మపురి అర్వింద్, ఫైర్‌బ్రాండ్ నేతగా గుర్తింపు పొంది దుబ్బాక ఉప ఎన్నికల్లో అందరి అంచనాలు తలకిందులు చేసిన రఘునందన్‌రావు, ఆదిలాబాద్ ఎంపీగా ఉన్న సోయం బాపూరావు ఓడిపోవడానికి కారణాలు ఏమై ఉంటాయా అన్న చర్చ పార్టీలో విస్తృతంగా సాగుతోంది.

పని చేయని బీసీ నినాదం

బీజేపీ బీసీ నినాదం, ఇతర పార్టీల కంటే అత్యధికంగా 36 సీట్లు బీసీలకు కేటాయించిన నేపథ్యం, అధికారంలోకి వస్తే బీసీ నేతను సీఎం చేస్తామనే పార్టీ విధానపరమైన నిర్ణయం... ఈ ఎన్నికల్లో కసీసంగా పనిచేయలేదని విశ్లేషిస్తున్నారు. ఈ ఎన్నికల్లో గెలిచిన ఎనిమిది మందిలో ముగ్గురు మాత్రమే బీసీలు ఉండటం, బీసీ సీఎం అభ్యర్థులుగా ముందువరుసలో నిలిచే సంజయ్, ఈటల, అర్వింద్ ఓటమి పాలవడం చూస్తుంటే బీసీ ప్రభావం ప్రశ్నార్థకంగానే ఉందని అంటున్నారు.

సంజయ్‌ను ఓడించేందుకు...

రాష్ట్రమంతా పాదయాత్ర చేసి ప్రజలకు దగ్గరై, బీఆర్‌ఎస్‌కు బీజేపీనే ప్రత్యామ్నాయం అన్నంత స్థాయిలో పార్టీ ఇమేజ్‌ని అమాంతం పెంచిన నేతగా గుర్తింపు పొందిన బండి సంజయ్ ఓటమికి పైకి కనిపించని కారణాలు ప్రభావితం చేసినట్టు అంచనా వేస్తున్నారు. కరీంనగర్ ఫలితాన్ని పోలింగ్ బూత్‌ల వారీగా విశ్లేషించిన పార్టీ నేతలు ముస్లిం, మైనారిటీ ఓటర్లు ఏకపక్షంగా సంజయ్‌కు వ్యతిరేకంగా ఓటేశారని లెక్కలు వేస్తున్నారు. ఎలాగైనా సంజయ్‌ను ఓడించాలంటూ పోలింగ్ సమయం నాటికి బీఆర్‌ఎస్‌తో కాంగ్రెస్ మిలాఖత్ అయిందని ఆరోపిస్తున్నారు. మొత్తం 390 పోలింగ్ బూత్‌లలో దాదాపు 200 బూత్‌లలో సంజయ్ ప్రత్యర్థి గంగుల కమలాకర్ కంటే ఎక్కువ ఓట్లు సాధించారు. మిగిలిన 186 బూత్‌లలోనే బీఆర్‌ఎస్ అభ్యర్థి అధిక ఓట్లు సాధించగలిగారు. ఈ నియోజకవర్గంలో ఉన్న 62 ముస్లిం ఓటర్ల ప్రభావిత పోలింగ్ కేంద్రాల్లో అత్యధిక ఓట్లు గంగులకే పడ్డాయి. ఉదాహరణకు చూస్తే హుస్సేన్ పురాలోని 232 నుంచి 241 వరకు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో 80 శాతానికిపైగా మైనారిటీ ముస్లిం ఓటర్లుండగా, వీటిలో పోలైన 6,764 ఓట్లలో సంజయ్‌కు కేవలం 259 మాత్రమే పడ్డాయి. ఈ బూత్‌లలో 4,979 ఓట్లు అంటే 80 శాతం కమలాకర్‌కు పడ్డాయి. సంజయ్ 3,163 ఓట్లతో వెనకబడడం చూస్తే...ఈ ఓట్లే సంజయ్ ఓటమిని శాసించాయని గణాంకాలతో సహా పార్టీ నాయకులు ఉదహరిస్తున్నారు. ఇక ముస్లిం ఓటర్ల ప్రాబల్యమున్న 62 పోలింగ్ బూత్‌లలో ఒక్కటంటే ఒక్క పోలింగ్ బూత్‌లో కూడా కాంగ్రెస్ అభ్యర్థి ఆధిక్యత కనబరచకపోవడం చూస్తే కమలాకర్‌తో మిలాఖత్ అయ్యారనే ఆరోపణలకు బలం చేకూరుతోందని విశ్లేషిస్తున్నారు. ప్రజల కోసం నిత్యం పోరాడే తనను ఓడించేందుకు ముస్లింలంతా ఏకమయ్యారని, హిందూ సమాజం ఇప్పటికైనా కళ్లు తెరవాలని బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు కూడా దీనినే స్పష్టం చేస్తున్నాయని చెబుతున్నారు.

అంతటా తిరగడం వల్లనే ఈటలకు నష్టం

కేసీఆర్‌ను గజ్వేల్‌లో పోటీచేసి ఓడిస్తానంటూ ఈటల రాజేందర్ సవాల్ విసిరి బరిలోకి దిగిన సంగతి తెలిసిందే. తన సిట్టింగ్ స్థానం హుజూరాబాద్‌తో పాటు గజ్వేల్‌లోనూ పోటీ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ నియోజకవర్గాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం ఈటలకు వ్యక్తిగతంగా నష్టం చేసిందని అంచనా వేస్తున్నారు. వరుసగా గెలుస్తూ వచ్చిన హుజూరాబాద్‌లో ఈ సారి త్రిముఖ పోటీ కారణంగా ప్రజా వ్యతిరేకత ప్రాతిపదికన కాంగ్రెస్ అధిక ఓట్లు చీల్చడంతో ఈటల అనూహ్యంగా ఓటమి పాలు కావాల్సి వచ్చిందని పార్టీ నాయకులు విశ్లేషిస్తున్నారు.

ఆత్మహత్యల్లో 6.6% అన్నదాతలవే!

- గతేడాది దేశవ్యాప్తంగా 5,207 మంది రైతుల బలవన్మరణం
- 6,083 మంది కౌలు రైతు, వ్యవసాయ కూలీలు కూడా..
- 2021తో పోలిస్తే 2022లో తెలంగాణలో మాత్రం తగ్గిన రైతు ఆత్మహత్యలు
- గతేడాది దేశంలో ఉసురుతీసుకున్న 1,70,924 మంది ప్రజలు
- జాతీయ నేర గణాంకాల బ్యూరో–2022 నివేదిక వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా అన్నదాతల ఆత్మహ్యతలు మాత్రం తగ్గడం లేదు. దేశవ్యాప్తంగా నమోదైన అన్ని రకాల ఆత్మహత్యల్లో 6.6 శాతం మంది వ్యవసాయ రంగానికి చెందినవారే ఉండటం గమనార్హం. 2022లో దేశవ్యాప్తంగా అన్ని రకాల కారణాలు కలిపి 1,70,924 మంది ప్రజలు ఆత్మహత్య చేసుకోగా అందులో 5,207 మంది రైతులతోపాటు మరో 6,083 మంది కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు బలవన్మరణానికి పాల్పడ్డారు. 2021తో పోలిస్తే 2022లో దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగానికి చెందిన వారి ఆత్మహత్యల్లో 3.75 శాతం నమోదైనట్లు జాతీయ నేర గణాంకాల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) 2022 నివేదిక తెలిపింది. 2021లో వ్యవసాయ రంగానికి చెందిన 10,881 మంది ఆత్మహత్య చేసుకోగా 2022లో 11,290 మంది ఉసురు తీసుకున్నారు.



రాష్ట్రంలో తగ్గిన రైతు ఆత్మహత్యలు..

ఈ నివేదిక ప్రకారం 2021తో పోలిస్తే 2022లో తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు తగ్గాయి. 2021లో రాష్ట్రంలో 303 మంది రైతు ఆత్మహత్యలు నమోదవగా 2022లో 178 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. తెలంగాణలో కౌలు రైతులు, వ్యవసాయ రంగం ఆధారిత కూలీల మరణాలు నమోదు కాలేదని నివేదిక వెల్లడించింది.

పెరిగిన రోడ్డు ప్రమాద మృతులు...

దేశవ్యాప్తంగా 2021లో జరిగిన అన్ని రకాల ప్రమాదాల్లో 3,97,530 మంది మృతిచెందగా 2022లో ఆ సంఖ్య 4,30,504కు చేరింది. ఆయా ప్రమాదాల్లో మృతిచెందిన వారిలో 30 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వారు 30.9 శాతం (1,32,846 మంది) ఉండగా 18 ఏళ్ల నుంచి 30 ఏళ్లలోపు వారు 24.9 శాతం (1,07,244 మంది) ఉన్నట్లు ఎన్‌సీఆర్‌బీ నివేదిక వెల్లడించింది. గతేడాది మొత్తం 4,46,768 రోడ్డు ప్రమాదాలు నమోదైనట్లు నివేదిక పేర్కొంది. రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 1,71,100 మంది మృతిచెందగా 4,23,158 మంది గాయపడ్డారు. రోడ్డు ప్రమాద బాధితుల్లో అత్యధికంగా 45.5 శాతం మంది ద్విచక్రవాహనదారులే కావడం గమనార్హం. అత్యధిక రోడ్డు ప్రమాదాలు అతివేగం కారణంగానే జరిగాయని నివేదిక తెలిపింది. అతి వేగం కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1,00,726 మంది దుర్మరణం చెందగా 2,72,661 మంది గాయపడ్డారు. 2021తో పోలిస్తే తెలంగాణలో రోడ్డు ప్రమాదాలు 1.4% మేర పెరిగాయి. 2021లో రాష్ట్రంలో మొత్తం 21,315 రోడ్డు ప్రమా దాలు జరగ్గా 2022లో 21,619 రోడ్డు ప్రమాద ఘటనలు నమోదయ్యాయని నివేదిక వెల్లడించింది. 2022లో రాష్ట్రవ్యాప్తంగా నమోదైన రోడ్డు ప్రమాదాల్లో 7,559 మంది మృతిచెందినట్లు తెలిపింది.

దేశవ్యాప్తంగా రైతులు, వ్యవసాయరంగ కూలీల ఆత్మహత్యలు..

ఏడాది	మొత్తం ఆత్మహత్యలు
2018	10,349
2019	10,281
2020	10,677
2021	10,881
2022	11,290

'ఉచిత ప్రయాణానికి' ఏర్పాట్లు!

- బస్సుల్లో మహిళలకు ఫ్రీ జర్నీపై కాంగ్రెస్ హామీ
- అధికారంలోకి వచ్చిన దరిమిలా ఆ మేరకు ఆర్టీసీ లెక్కలు
- కర్ణాటకలో అమలవుతున్న తీరును అధ్యయనం చేయనున్న టీఎస్ ఆర్టీసీ అధికారులు
- నలుగురు సభ్యుల బృందం బెంగళూరుకు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించేందుకు ఏర్పాట్లు మొదలయ్యాయి. ఏయే కేటగిరీ బస్సుల్లో అమలు చేస్తే ఎంత భారం పడనుందనే విషయంలో ఆర్టీసీ అధికారులు లెక్కలు సిద్ధం చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో ఈ పథకం ఎలా అమలవుతోంది, అక్కడ ఎంత ఖర్చవుతోంది, దాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎలా సర్దుబాటు చేస్తోంది.. అన్న విషయాలను పరిశీలించేందుకు నలుగురు ఆర్టీసీ అధికారుల బృందం బెంగళూరుకు వెళ్తోంది. రెండు రోజుల పాటు అక్కడ పరిశీలించి నివేదికను సిద్ధం చేయనుంది. అధికారంలోకి వస్తే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ వసతి కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. తాజా ఎన్నికల్లో ఆ పార్టీ అధికారంలోకి రావటంతో అధికారులు పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేస్తున్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పేరును పార్టీ అధిష్టానం ఖరారు చేసిన నేపథ్యంలో ప్రభుత్వం కొలువుదీరబోతోంది. దీంతో వీలైనంత తొందరలో ఈ పథకం అమలు చేసే అవకాశం ఉన్నందున, ముఖ్యమంత్రి అడిగిన వెంటనే నివేదిక అందజేసేందుకు వీలుగా ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది.

ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో కూడా అమలు చేస్తే..

దక్షిణాదిలో తొలుత తమిళనాడు రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ వసతి కల్పించారు. కానీ అక్కడ, కేవలం నగర, పట్టణ ప్రాంతాల్లో తిరిగే సిటీ ఆర్డినరీ బస్సుల్లో మాత్రమే ఈ వెసులుబాటు కల్పించారు. ఇందుకోసం ప్రత్యేకంగా గులాబీ రంగులో ఉండే బస్సులను అందుబాటులోకి తెచ్చారు. వాటిల్లోనే ఈ వెసులుబాటు ఉంటుంది. కానీ, కర్ణాటకలో మాత్రం రాష్ట్రవ్యాప్తంగా ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సుల్లో ఈ వసతి కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీని ప్రకటించింది. అధికారంలోకి రావటంతో దాన్ని అమలులోకి తెచ్చింది. తెలంగాణలో కూడా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. కానీ కర్ణాటక మోడల్‌ను అనుసరిస్తుందా, తమిళనాడు మోడల్‌ను చేపడుతుందా అన్న విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. కర్ణాటక తరహాలో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌బస్సుల్లో ఈ పథకాన్ని అమలు చేస్తే సాలీనా రూ.2200 కోట్లు అవుతుంది. పల్లెవెలుగు బస్సులకే పరిమితం చేస్తే ఏటా రూ.750 కోట్లు అవుతుందని అంచనా వేస్తున్నారు.



ప్రభుత్వం ఇవ్వాల్సింది ప్రతినెలా దాదాపు రూ.185 కోట్లు ..

మహిళలకు ఉచిత ప్రయాణ పథకం ప్రారంభమైతే, ఆ రూపంలో ఆర్టీసీ కోల్పోయే టికెట్ ఆదాయాన్ని ప్రభుత్వం రీయింబర్స్ చేయాల్సి ఉంటుంది. ఎక్స్‌ప్రెస్ కేటగిరీ బస్సుల వరకు ఈ పథకాన్ని అమలు చేస్తే సాలీనా రూ.2200 కోట్ల వరకు రీయింబర్స్ చేయాలి. అంటే ప్రతి నెలా రూ.185 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది.

జీరో టికెట్ ప్రవేశపెడతారా..?

ఎంతమంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారన్నది లెక్క తేలాల్సి ఉంటుంది. ఇందుకోసం కర్ణాటకలో జీరో టికెట్ విధానం ప్రారంభించారు. మహిళలకు రూ.సున్నా అని ఉండే జీరో టికెట్‌ను జారీ చేస్తారు. అలా రోజుకు ఎన్ని టికెట్లు జారీ అయ్యాయో నమోదు చేసి నెలవారీగా లెక్కిస్తారు. ఇక్కడ అదే పద్ధతి ప్రవేశపెడతారా లేక మరో విధానాన్ని అనుసరిస్తారా అన్నది తేలాల్సి ఉంది.

కురుమూర్తి ఆలయ హుండీ లెక్కింపు



కురుమూర్తి స్వామి ఆలయ హుండీ లెక్కిస్తున్న భక్తులు

చిన్నచింతకుంట: చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపురం కురుమూర్తి స్వామి జాతర ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులు కానుకలుగా సమర్పించిన హుండీని మంగళవారం అధికారులు రెండో సారి లెక్కించారు. స్వామి హుండీ ఆదాయం రూ.27,47,855 వచ్చినట్లు ఆలయ ఈఓ మధుసూదన్‌రెడ్డి, చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మొదటి సారి రూ.20,69,089 ఆదాయం రాగా.. ఈ ఉత్సవాల్లో ఇప్పటికీ హుండీ ఆదాయం రూ.48,16,944 సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఉన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ..

జాతర ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు వివిధ వాహనాల్లో తరలివచ్చి క్యూలైన్లో నిల్చున్నారు. మెట్లపై కొబ్బరికాయలు కొట్టి గోవింద నామస్మరణలతో స్వామి వారిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు మట్టికుండలో నైవేద్యం తయారు చేసి దాసంగాలు పెట్టి స్వామిని వేడుకున్నారు. తలనీలాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



జాతర మైదానంలో భక్తుల రద్దీ




కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే విజయుడు



అలంపూర్: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్‌ను ఎమ్మెల్యే విజయుడు మంగళవారం కలిసినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల బరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఘన విజ యం సాధించిన విజయుడు కేసీఆర్‌ను, కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఇద్దరు శుభాకాంక్షలు తెలిపినట్లు పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించినట్లు తెలిపారు.



క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈఓ సీరాజుద్దీన్

- డీఈఓ సీరాజుద్దీన్
- ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్–17 క్రికెట్ పోటీలు ప్రారంభం

గద్వాల అర్బన్: విద్యార్థుల్లో శారీరక దారుఢ్యాన్ని పెంచి మానసిక ఒత్తిడిని తొలగించడానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయని డీఈఓ సీరాజుద్దీన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో 67వ రాష్ట్ర స్థాయి అండర్–17 క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు డీఈఓ సీరాజుద్దీన్‌తో పాటు సీఐ శ్రీనివాసులు ముఖ్యఅతిథిలుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల్లో ప్రతిభను ప్రదర్శించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించి తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం సీఐ శ్రీనివాసులు మాట్లాడారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా, క్రీడల వైపు ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు.

మొదటి రోజు మ్యాచ్‌లు..

ఈ నెల 8వ తేదీ వరకు పది జిల్లాలకు సంబంధించిన అండర్–17 జట్లు ఈ మ్యాచుల్లో పాల్గొననున్నాయి. అయితే మొదటి రోజు నిజామాబాద్ వర్సెస్ ఆదిలాబాద్ జట్లు తలబడగా ఆదిలాబాద్ జట్టు విజయం సాధించింది. అదే విధంగా రంగారెడ్డి జట్టుపై కరీంనగర్, నల్గొండ జట్టుపై ఖమ్మం, హైదరాబాద్ జట్టుపై వరంగల్ జట్టు విజయం సాధించాయి. కార్యక్రమంలో డీవైఎస్ఓ ఆనంద్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణ, నాగేష్ బాబు, బీసన్న, నర్సింహరాజు, రజినికాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ సీరాజుద్దీన్

జాతీయస్థాయి పోటీలకు వెన్నచర్ల విద్యార్థిని

కందనూలు: హైదరాబాద్‌లోని బేగంపేట సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు 2023కు జిల్లాలోని వెన్నెచర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని శివమణి ఎంపికైంది. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి మాట్లాడారు. వివిధ జిల్లాల నుంచి మొత్తం 132 ప్రాజెక్టులు ఈ పోటీల్లో పాల్గొన్నాయని, వీటిలో జాతీయ స్థాయికి కేవలం 13 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి వెన్నచెర్ల గ్రామ పాఠశాల విద్యార్థిని శివమణి రూపొందించిన 'ఆవు బూడిద, ఔషధ గుణాలు' కలిగిన మొక్కలతో 'ధాన్యం నిల్వ సామర్థ్యం, కూరగాయల నిల్వ సామర్థ్యం పెంపొందించడం' అనే ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైందని తెలిపారు. గైడ్ టీచర్ టి.రాజశేఖర్ రావు ఆధ్వర్యంలో చేసిన ప్రాజెక్ట్ జాతీయ స్థాయికి ఎంపిక కావడం చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గైడ్ టీచర్ రాజశేఖర్, విద్యార్థిని శివమణిని, జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు, జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డిని అభినందించారు. గతంలో కూడా ఇదే పాఠశాల నుంచి అంతర్జాతీయ సైన్స్ ఫెయిర్‌లో బంగారు పతకం సాధించారని డీఈఓ తెలిపారు. జాతీయ స్థాయిలో జిల్లాకు పతకం తీసుకురావడంతో పాటు పేరు తీసుకురావాలని కోరారు.



విద్యార్థిని శివమణిని అభినందిస్తున్న నిర్వాహకులు

వ్యవసాయంలో నేల ఆరోగ్యం కీలకం



రైతుల్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న పాలెం కేవీకే కో–ఆర్డినేటర్ డా.ప్రభాకర్‌రెడ్డి

- పాలెం కేవీకే సమన్వయకర్త డా.ప్రభాకర్‌రెడ్డి

బిజినేపల్లి: వ్యవసాయంలో రైతులు సాగు చేసే నేలలో కృత్రిమ ఎరువులు, పిచికారీ మందులు ఎక్కువగా ఉపయోగించరాదని, వ్యవసాయానికి నేల ఆరోగ్యమే కీలకమని పాలెం కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డా.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పాలెం కేవీకే ఆధ్వర్యంలో ప్రపంచ నేల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. రైతులు తమ వ్యవసాయ భూముల్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఎక్కువగా సేంద్రియ ఎరువుల్ని వినియోగించాలని, పప్పుధాన్యం పంటలను సాగు చేయాలన్నారు. భూసార పరీక్షలు రైతులు ఎప్పటికప్పుడు నిర్వహించుకోవాలని, అప్పుడే నేలకు అవసరమైన పోషకాలు అందించే సేంద్రియ ఎరువుల్ని, పంటలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డా.రామకృష్ణ, డా.శైల, డా.ఆదిశంకర్ రైతులు పాల్గొన్నారు.

జూరాలకు కొనసాగుతున్న వరద

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు స్వల్పంగా కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు 342 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 67 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 390 క్యూసెక్కులు, కుడి కాల్వకు 338 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 673 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్ 2కు 544 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 1,468 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీట్టిం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.126 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

నిండుకుండలా కోయిల్‌సాగర్..

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటితో నిండుకుండలా మారింది. గత నెల ప్రారంభం వరకు వానాకాలం పంటలకు, గొలుసు కట్టు చెరువులకు నీటిని విడుదల చేస్తూ.. వచ్చారు. పంటలు చేతికి రావడంతో ప్రాజెక్టు రెండు కాల్వలను మూసివేశారు. ప్రాజెక్టు నీటి మట్టం తగ్గడంతో తిరిగి జూరాల నుంచి ఎత్తిపోతల పథకం ద్వార నీటిని విడుదల చేస్తూ.. వచ్చారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 32.6 అడుగులు కాగా.. మంగళవారం సాయంత్రం వరకు 32.3 అడుగులకు చేరింది. కేవలం 0.3 ఈంచుల నీరు మాత్రమే తక్కువగా ఉంది. అయితే ప్రాజెక్టులో గాలితో అలలు వస్తుండడంతో గేట్ల నుంచి నీరు జాలువారుతుంది. ఈ ఏడాది యాసంగి పంటలకు నీటిని వదిలే విషయం ఇంకా అధికారులు ప్రకటించలేదు. వర్షాభావ పరిస్థితులు కారణంగా ప్రాజెక్టు నిల్వ ఉన్న నీటిని వేసవి వరకు తాగునీటి కోసం ఉపయోగించే అవకాశం ఉన్నట్లు అధికారులు గతంలో ప్రకటించారు.